క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం నగదును అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరావు

బుచ్చెయ్యపేట : ఐయితంపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముచ్చకర్ల వెంకటరావు గ్రామదేవత మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఇటీవల గ్రామంలో కొత్తగా మరిడిమాంబ ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి తనవంతు సహకారంగా వెంకటరావు తన సొంత నిధులు లక్ష రూపాయలు జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ పెద్దాడ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు.

రోడ్డు పనుల పరిశీలన

మాకవరపాలెం: రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఈఈ ప్రసాద్ పరిశీలించారు. మండలంలోని గిడుతూరు నుంచి కోటవురట్ల మండలం సుంకపూరు వెళ్లేందుకు 2.5 కిలోమీటర్లు పొడవున తారు రోడ్డు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.కోటి 80 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులను గురువారం ఈఈ పరిశీలించి, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రాజెక్టు డీఈ సత్యనారాయణ ఉన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

బుచ్చెయ్యపేట: జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మేజర్ పంచాయితీ వడ్డాదికి చెందిన సయ్యపురెడి సత్యనారాయణ ఎన్నికయ్యారు. డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న నుండి ఈయన నియమక పత్రాన్ని గురువారం అందుకున్నారు.

ఉపాధి కూలీలకు వాటర్‌కేన్‌ల వితరణ

రోలుగుంట : కుసుర్లపూడిలో కేసర్లవాని చెరువులో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి, ఇక్కడ 25 జట్లు ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. మండుతున్న ఎండలకు వీరి దాహార్తి తీర్చేందుకు జట్టుకో వాటర్ కేన్‌ను గురువారం గ్రామ మాజీ సర్పంచ్ గండి తాతాజీ అందజేశారు. మేట్‌లు, కూలీలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మరిడిమహాలక్ష్మి జాతర




ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి గురువారం మరిడిమహాలక్ష్మి వారి జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతి మూడేళ్లకొకసారి అమ్మవారి జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకొంటారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో డప్పు వాయిద్యాలు, గరగల డాన్స్ కనువిందు చేశాయి. డాన్స్‌బేబీ డాన్స్ స్టేజ్ ప్రోగ్రాంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కెనాల్‌లో నాచు, మొక్కలు తొలగింపు

కె.కోటపాడు : గవరపాలెం-దాలివలస గ్రామాల మధ్య గల రైవాడ కెనాల్ మార్గంలో పేరుకుపోయిన మొక్కలు, నాచును తొలగించే పనులను జీవీఎంసీకి చెందిన లస్కర్‌లు నిర్వహిస్తున్నారు. రైవాడ నుంచి కెనాల్ మార్గం గుండా విశాఖపట్నానికి ప్రతిరోజు 50 క్యూసెక్కుల నీరు వెళుతుంది. ఈ కెనాల్ మార్గం అడుగుభాగంలో నాచు, మొక్కలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహ వేగం మందగిస్తుంది. దీంతోఅధికారులు కెనాల్ మార్గంలో మొక్కలు, నాచు తొలగింపు పనులు చేపట్టి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూశారు.

ఘనంగా తోబుట్టువుల దినోత్సవం



తూటిపాలలో తోబుట్టువుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులతో తోబుట్టువుల దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.రాము మాట్లాడుతూ అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు ఆప్యాయతలతో కలసిమెలసి ఉండాలని సూచించారు. ఒకే పాఠశాలలో తోబుట్టువులు చదువుకోవడం ఎంతో అనుభూతిని ఇస్తుందన్నారు. సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



శారదానదిలో దెబ్బతిన్న జి.జగన్నాథపురం గ్రోయిన్



శిథిలమైన చాకిపల్లి గ్రోయిన్

అందని సాగునీరు.. పట్టించుకోరూ..!

- అక్రమ ఇసుక తవ్వకాలతో కొట్టుకుపోయిన గ్రోయిన్లు
- ఈ ఏడాది ఖరీఫ్‌కైనా మరమ్మతులు జరిగేనా..?
- జిల్లాలో 13 వేల ఎకరాలకు అందని సాగునీరు



పెద్దేరులో పూర్తిగా కొట్టుకుపోయిన శ్రీరాంపట్నం గ్రోయిన్

చోడవరం : సాగునీటి వనరులు ఆశించిన స్థాయిలో మెరుగుపడకపోవడంతో వ్యవసాయానికి నీరులేక రైతన్న ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రధాన నదులు ఉన్నప్పటికీ వాటిపై ఉన్న గ్రోయిన్లు పూర్తిగా శిథిలమైపోవడంతో నదుల్లో నీరు వృథాగా దిగువకు పోతుంది. దీనితో పరివాహక ప్రాంత రైతులకు సాగునీరందక వ్యవసాయానికి నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో శారద, పెద్దేరు, బొడ్డేరు, తాచేరు, సర్పాతోపాటు పలు కొండ గెడ్డలపై సాగునీటి ని నిల్వచేసే గ్రోయిన్లు ఉండేవి. నదులు, గెడ్డల్లో గ్రోయిన్లు ఉన్న ప్రదేశాల్లో కూడా యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు చేయడంతో జిల్లాలో ఉన్న సుమారు 21 సాగునీటి గ్రోయిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గ్రోయిన్ల రాతికట్టులు నదీ ప్రవాహానికి కొట్టుకుపోవడంతో కట్టులు లేక ఎగువ నుంచి వస్తున్న నీరు నిల్వ ఉండకుండా దిగువకు వృథాగా పోతుంది. దీంతో సాగునీరు అందక నదీ పరివాహక ప్రాంత రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల్లో ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారు. పెద్దేరు, శారదానదులపై చాకిపల్లి, భోగాపురం, శ్రీరాంపట్నం, పి.ఎస్.పేట, బెన్నవోలు, గౌరీపట్నం, ముద్దుర్తి, తగరంపూడి, సీతానగరం, జి.జగన్నాథపురంతో పాటు సుమారు 21 గ్రోయిన్లు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పుడు పూర్తిగా శిథిలమైపోయాయి. ఒక్కో గ్రోయిన్ కింద 200 నుంచి 500 ఎకరాల ఆయకట్టు ఉంది. చాకిపల్లి గ్రోయిన్ కింద 250 ఎకరాలు, భోగాపురం కింద 350, శ్రీరాంపట్నం 200, పిఎస్‌పేట 250, బెన్నవోలు 275, గౌరీపట్నం గ్రాయిన్‌కింద 1000 ఎకరాలు సాగు ఆయకట్టు ఉంది. మిగతా గ్రోయిన్ల కింద కూడా సుమారు 10వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దెబ్బతిన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి నీరు విడుదల చేసినప్పుడు, భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ గ్రోయిన్లలో నీరు నిల్వ ఉండకుండా దిగువకు వృథాగా పోయి సముద్రంలో కలిసిపోతుంది. వర్షాలు కురిసినా గ్రోయిన్ రాతికట్టు పూర్తిగా లేకపోవడంతో నదిలో నీరు కనీసం నిలవకుండా పోతుంది. గ్రోయిన్లకు నిర్మించిన స్లూయీస్‌లు కూడా పూర్తిగా దెబ్బతినడంతో నదిలో నీరు పంటకాలువలకు పారడం లేదు.

హామీ మరిచిన కూటమి ప్రభుత్వం

శిథిలమైన వాటిని మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంతవరకు మరమ్మతులు మాత్రం జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రోయిన్లకు మరమ్మతులు చేపడతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్పటికీ ఏడాది గడుస్తున్నా పట్టించుకోలేదు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగానైనా గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలని, ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



పెద్దేరు నదిలో చాకిపల్లి గ్రోయిన్ కింద నాకు ఎకరా ఆయకట్టు పొలం ఉంది. ఈ గ్రోయిన్ వరదలకు కొట్టుకుపోవడం వల్ల ఏటిలో నీరు నిల్వ ఉండడం లేదు. అనేకసార్లు దరఖాస్తులు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. సాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలి.

– అప్పలనాయుడు, రైతు, బెన్నవోలు

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



శారదానది ఒడ్డున మాకు ఎకరాన్నర పొలం ఉంది. జి.జగన్నాథపురం వద్ద ఉన్న మల్లంపేట గ్రోయిన్ కింద ఆయకట్టు భూమి మాది. ఇక్కడ ఇష్టం వచ్చినట్టు ఇసుకను తవ్వేశారు. దీంతో గ్రోయిన్ రాతికట్టు పూర్తిగా కొట్టుకుపోయింది. నదిలో నీరు వృథాగా దిగువకు పోతుంది. సాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే మరమ్మతులు చేయాలి.

– వెంకటరమణ, రైతు, జీజేపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : కె.కోటపాడు ఫీడర్ పరిధిలో శుక్రవారం మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ పనుల నిర్వహణ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కె.కోటపాడు గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నర్సీపట్నం : విద్యుత్ లైన్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను క్లియర్ చేసేందుకు పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ నుంచి శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.డి.రామకృష్ణారావు తెలిపారు. బీసీ, ఎస్సీ కాలనీ, పినారిపాలెం, డీఎస్పీ బంగ్లా, కలాసి కాలనీ, సీబీఎం కాపౌండ్, అయ్యన్నకాలనీ, నీలంపేట ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం.అలమండ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎం.అలమండ ఫీడర్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సోలార్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, రెవెన్యూ సిబ్బంది

రావికమతం : కవగుంట గ్రామంలో సుమారు 6 సెంట్ల స్థలంలో సోలార్ సదుపాయం ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయి. సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం స్థల పరిశీలన చేశారు. పంచాయతీలకు సోలార్ సదుపాయం ఏర్పాటు చేయడం వల్ల కరెంటు పోయినా సచివాలయాల్లో అత్యవసర పనులకు ఆటంకం ఉండదని సర్పంచ్ తెలిపారు.

ఏపీటీఎఫ్ స్థలం విక్రయిస్తే అడ్డుకుంటాం



ఏపీటీఎఫ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాదిలో ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలాన్ని విక్రయించాలని చూస్తే అడ్డుకుంటామని గ్రామ నాయకులు తెలిపారు. మేజర్ పంచాయతీ వడ్డాది దొరబాబు కాలనీలో అప్పటి ఏపీటీఎఫ్ సంఘ నాయకుడు ఉపాధ్యాయుడు వెలంపూడి సత్యనారాయణ కోరిక మేరకు 1999లో సర్వే నంబర్ 49లో 3 సెంట్ల స్థలాన్ని సంఘ భవనానికి కేటాయించారన్నారు. ఈ స్థలాన్ని గురువారం గ్రామనాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్లగా సంఘ భవనం నిర్మాణం జరగకపోవడంతో స్థలం ఖాళీగా ఉందన్నారు. ఈ స్థలాన్ని ఇటీవల ఏపీటీఎఫ్ సంఘ నాయకులు కొంతమంది గ్రామ పంచాయతీకి, గ్రామ నాయకులకు తెలియకుండా విక్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. సంఘానికి భవనం కడతామంటే స్థలం కేటాయించాం తప్ప అమ్మకానికి కాదని, ఎవరైనా సంఘ భవనం స్థలం అమ్మినా, కొన్నా చెల్లుబాటు కాదని ఉప సర్పంచ్ దాడి సూరినాగేశ్వరరావు, నాయకులు దొండా నరేష్, అడపా నరిసింహమూర్తి, సయ్యపురెడ్డి సత్యనారాయణ, మాధవరావు, కోవెల వెంకటర రమణ, తలారి శంకర్, కనక, సూరిబాబు తదితరులు స్పష్టం చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శంగా, సంఘ సేవకుల్లా ఉండాలి తప్ప రాజకీయాలు చేయడం తగదన్నారు. ఏపీటీఎఫ్ సంఘానికి కేటాయించిన స్థలంలో సంఘ భవనం కట్టాలి.. లేదంటే పంచాయతీకి తిరిగి స్థలం స్వాధీనం చేసుకుంటామన్నారు.

రోడ్డు వేసి హామీ నిలబెట్టుకున్నారు..



ఎంపీటీసీ సత్యవతి, చంద్రను సత్కరిస్తున్న వార్డు ప్రజలు



బుచ్చింపేటలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

రోలుగుంట : బుచ్చింపేటలో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు ఉలబాల సత్యవతిని ఒకటో వార్డు వీధివాసులు గురువారం ఘనంగా సత్కరించారు. స్థలం లేక, రహదారియోగ్యంగా లేని ఈ వార్డుకు రోడ్డు వేయిస్తామని వారు ఎన్నికల ముందు మాట ఇచ్చారు. ఈ మేరకు ఎంపీటీసీ తన సొంత స్థలాన్ని రోడ్డు కోసం ఇచ్చారు. అలాగే రోడ్డు కోసం సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థన మేరకు అప్పటి వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో శరవేగంగా పనులు పూర్తి చేయించారు. దీంతో సర్పంచ్, ఎంపీటీసీలను వార్డు సభ్యులు ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, మెమెంటోలు అందజేశారు. స్థానిక నాయకులు ఉలబాల రాము, దాలబ్బాయి, సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు విశాఖలో విద్యుత్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దేవరాపల్లి : విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ఆపాలని, పర్మనెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 12న విశాఖపట్నంలో జరిగే ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రీజనల్ కార్యదర్శి ప్రేమ చంద్రశేఖర్ కోరారు. విశాఖపట్నం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. దేవరాపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పోస్టర్, కరపత్రాన్ని గురువారం యూనియన్ నాయుకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.రాము, ఎస్. అవతారం, టి.శేష్, సిఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలి డబ్బులు వెంటనే చెల్లించాలి



విలేకరులతో మాట్లాడుతున్న వెంకన్న, గిరిజన సంఘం నాయకుడు నరసింహమూర్తి

మాడుగుల: కేంద్ర, ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించక వారి పొట్ట కొడుతోందని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించాలన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

కె.కోటపాడు : స్థానిక సీహెచ్‌సీలో రోగులకు అందించే భోజన సౌకర్యాన్ని మరింతగా మెరుగుపర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీని గురువారం ఆయన పరిశీలించారు. రోగులకు భోజనానికి ప్రతి రోజూ రూ.100లను ప్రభుత్వం వీరికి చెల్లిస్తున్నా, దానికి సరిపడా నాణ్యమైన భోజనం అందివ్వడం లేదని ఆరోపించారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

నర్సీపట్నం : అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటలకు పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పెన్ను, హాల్ టిక్కెట్, ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకు రావాలని సూచించారు.

ఐదుగ్రామాల్లో గ్రామదేవతల పండగ

మాకవరపాలెం : మండలంలోని ఐదు గ్రామాల్లో గ్రామ దేవతల పండగలను ఘనంగా నిర్వహించారు. రామన్నపాలెంలో బండితల్లి పండగ, కొత్తపాలెం, ధర్మవరం, జి.వెంకటాపురం, యరకన్నపాలెం గ్రామాల్లో మరిడిమాంబ పండగలను స్థానికులు గురువారం వైభవంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

గొలుగొండ : అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టిహారం క్రమంతప్పక అందించాలని గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి తెలిపారు. కృష్ణదేవిపేటలో గొలుగొండ సెక్టార్ పరిధిలో ఉన్న గొలుగొండ, నాతవరం మండలాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు మంచి ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. చిన్నారులకు ఊబకాయం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యశ్రీ, సత్యవతి, నాగజ్యోతి, విజయలక్ష్మి, సూర్యప్రభ, బీపీసీ ప్రతినిధి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎం.కోడూరులో మోదకొండమ్మ జెండా పండగ



అమ్మవారి ఘటాలు సతకంపట్టు వద్దకు తీసుకు వెళుతున్న సర్పంచ్ సంజీవరావు తదితరులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో మోదకొండమ్మ నెల రోజుల జెండా పండుగ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. 150 అడుగుల వెదురు కర్రను తీసుకు వచ్చి అమ్మవారి సతకం పట్టు వద్ద ఉంచి పండగ నెల రోజుల పాటు నిర్వహిస్తారు. అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను ఆలయం నుంచి సతకంపట్టు వద్దకు తీసుకువచ్చి విడిది చేస్తారు. నెల రోజుల తరువాత నేల వేషాలు, తప్పిటగుళ్ల వాయిద్యాల నడుమ అమ్మవారి జాతర అనంతరం తిరిగి ఆలయానికి ఘటాలు చేర్చడంతో పండగ పూర్తవుతుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మోదకొండమ్మ మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులతో డ్రైనేజీ నిర్మాణం



కాలనీలో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, సర్పంచ్ సూర్యనారాయణ

నాతవరం : వైఎస్సార్ కాలనీవాసులకు డ్రైనేజీ సదుపాయం కల్పించడానికి సర్పంచ్ విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసినట్టు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. గునుపూడి గ్రామంలో పశువైద్యశాల సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డును అనుకుని వైఎస్సార్ కాలనీ ఏర్పాటు చేశారు. కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి పంచాయతీలో నిధులు లేకపోవడంతో జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, ఎంపీపీ లక్ష్మణమూర్తి ద్వారా సర్పంచ్ వేముల సూర్యనారాయణ నిధులు మంజూరు చేయించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ నిధుల నుంచి రూ.10 లక్షలు పంచాయతీ అభివృద్ధికి తీసుకువచ్చారు. ఈ నిధులతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ స్వయంగా పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీ డ్రైనేజీని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు వెంటనే ఇస్తానన్నారు. మధ్యలో కల్వర్టు నిర్మాణం, ఇతర పనులకు సంబంధించి జేఈతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో బోర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

14న కె.జె.పురంలో గంగాలమ్మ తల్లి తీర్థం

గోడపత్రికలను ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో ఈ నెల 14న స్వయంభూ గంగాలమ్మ తల్లి తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తీర్థం రోజున జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా తీర్థమహోత్సవానికి సంబంధించి గోడపత్రికలను గురువారం అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా నిర్వాహకులు ఆవిష్కరించారు. ఎడ్ల పరుగు పోటీల్లో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు పురస్కారాన్ని అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాళ్ల రాము, ఆదిబాల, జగ్గారావు పాల్గొన్నారు.

గొలుగొండలో మోస్తరు వర్షం



ఏఎల్‌పురంలో గాలులకు విరిగిన చెట్టు



నాతవరం ఎంపీడీవో కార్యాలయం ముందు చేరిన వర్షపునీరు

గొలుగొండ: గొలుగొండ, చిన్నయ్యపాలెం, ఏఎల్‌పురం, కొత్తమల్లంపేట, అమ్మపేట, కొత్తపాలెం తదితర గ్రామాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏఎల్‌పురం గ్రామంలో భారీ గాలులకు ఇంటి సమీపంలో ఉన్న చెట్టు నేలకొరిగింది. పక్కనే ఉన్న గోడ కూలిపోగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

నాతవరం: ఉదయం నుంచి ఎడతేరిపి లేకుండా ఉక్కపోతతో తీవ్రంగా ఎండ కాచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురియడంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో కొంత జీడిమామిడి రైతులకు నష్టం కలిగించినప్పటికి వాతావరణం చల్లబడింది. రైతులకు ఆరుతడి తొలకరి పంట నువ్వు చేను వేసుకోవడానికి పొలాల్లో దుక్కులు చేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో తహసీల్దార్, ఎంపీడీవో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నీరు చేరి ప్రాంగణమంతా బురదమయంగా తయారైంది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రజని

రావికమతం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని కొత్తకోట పీహెచ్‌సీ డాక్టర్ రజని అన్నారు. 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు పురస్కరించుకొని రావికమతం ప్రాజెక్టు, మేడివాడ సెక్టారు పరిధిలో జెడ్.బెన్నవరం, కొత్తకోట గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. జెడ్.బెన్నవరం గ్రామంలో డాక్టర్ రజనీ మాట్లాడుతూ గర్భం దాల్చిన దగ్గర నుంచి శిశువుకు జన్మనిచ్చే వరకు, ఆ శిశువుకు రెండేళ్ల వయస్సు వచ్చేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెయ్యి రోజుల కార్యక్రమంపై వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.